సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మత్స్యకారులకు మోటార్లు పంపిణీ

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో మత్స్యకారులకు అవుట్ బోర్డు మోటార్లు పంపిణీ చేశారు. జిల్లా మత్స్యకార సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా మత్స్యకారులకు ఈ అవుట్ బోర్డు మోటార్స్ పంపిణీ చేశామని తెలిపారు. 40 శాతం సబ్సిడీతో 39 మంది మత్స్యకారులకు కేంద్రం ఈ మోటార్స్ అందజేసిందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార శాఖ జేడీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు విశ్వకళా భూషణ్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దుర్గాప్రసాద్

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ పండాకు జాతీయ విశ్వకళా భూషణ్ పురస్కారం లభించింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన త్యాగరాయ గాన సభలో తనకు ఈ పురస్కారం అందించినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. భక్తి పాటల గాయకుడిగా తాను అందించిన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. తనను గుర్తించిన సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. పురస్కారం అందుకున్న దుర్గాప్రసాద్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు జీతాలివ్వాలని వినతి



ప్రొఫెసర్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం : ఆంధ్ర యూనివర్సిటీలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి నెలవారీ జీతాలు ఇవ్వాలని సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీ రాజుకు గురువారం వినతి పత్రం అందించారు. ఏయూలో పదవీకాలం పూర్తయినా పని చేస్తున్న ఏజెంట్ ప్రొఫెసర్, పీవోపీలను వెంటనే వెనక్కి పంపాలని కోరారు. అతిథి అధ్యాపకులకు కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీను, డాక్టర్ విక్రమ్, డాక్టర్ మాథ్యూస్ సులోచన, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రెహమాన్, డాక్టర్ మహేష్ తదితరులు వినతిపత్రం అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతమ్మధారకు చెందిన టేకి యాదవరావు (24) నగరంలోని ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న రాత్రి విధులు ముగించుకుని కృష్ణా కళాశాల మీదుగా ఇంటికి వెళ్తుండగా హెచ్‌బీ కాలనీ జంక్షన్ వద్ద సీతమ్మధార వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని బొలేరో వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో కుడి కాలుతోపాటు కాలర్ బోన్ విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ యాదవరావుతో పనిచేసే కొందరి సాయంతో స్థానికులు 108లో కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓమ్ని ఆర్కే ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆ గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని యాదవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో రైల్వే భద్రతా దళం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సలీం పాషా, అమ్ముకుట్టి, నిషాదేవిలు కర్ణాటకకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆరోగ్యం ఆహ్లాదం



ఎరీనాలో తీర్చిదిద్దిన మట్టిరోడ్డుతో కూడిన వాకింగ్, జాగింగ్ ట్రాక్



హెల్త్ ఎరీనాలో వాకింగ్ చేస్తున్న యువత



ఎరీనాలోని బీచ్‌రోడ్డు ప్రవేశ మార్గం వద్ద సేద తీరుతున్న సందర్శకులు



ఎరీనాలో జాగింగ్ అనంతరం వ్యాయామం చేస్తున్న యువకులు



ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన హెల్త్ ఎరీనా ముఖద్వారం



బుద్ధవనం వద్ద ఆహ్లాదకరంగా గడుపుతున్న పిల్లలు, పెద్దలు

- ఆకట్టుకుంటున్న వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా
- సహజసిద్ధ ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఎంవీపీ కాలనీ వాసులు
- ఆకర్షణీయంగా వాకింగ్ ట్రాక్స్, పచ్చదనం, బుద్ధ విగ్రహం
- సాయంత్రం వేళ సేదతీరుతున్న పిల్లలు, పెద్దలు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలో కైలాసగిరి కొండను ఆనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరీనా సహజసిద్ధ ప్రకృతి అందాలతో ఆహ్లాదాన్ని పంచుతూ ఆకట్టుకుంటోంది. ఒకవైపు ఆహ్లాదకర వాతావరణం... మరోవైపు ఆరోగ్యాన్ని పంచే ఇక్కడి నడక, సైక్లింగ్ మార్గాలకు ఎంవీపీ కాలనీ వాసులతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల వాసులు ఫిదా అవుతున్నారు. సహజసిద్ధ వాతావరణంలో ఉదయం, సాయంత్రం నడకతోపాటు వ్యాయామం చేసేందుకు తరలివస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అందిస్తున్న సౌకర్యాలు, నిర్వాహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ యోగ, మెడిటేషన్ చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, చిన్నారులు సైతం ఎరీనాలోని బుద్ధవనం వద్ద సేద తీరుతూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. దీంతో సందర్శకులకు ఆరోగ్యంతోపాటు ఆహ్లాదాన్ని కూడా హెల్త్ ఎరీనా పంచుతోంది.

ప్రకృతిని ఆస్వాదిస్తున్న సందర్శకులు..

రోజూ ఉదయం 5 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు హెల్త్ ఎరీనా సందర్శకులకు సేవలు అందిస్తోంది. 2.5 కిలోమీటర్ల దూరం విస్తరించిన హెల్త్ ఎరీనాలో అడుగడుగునా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్‌కు అనుసంధానంగా వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఉద్యానవనాలు, పూల మొక్కలు వాకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కైలాసగిరి కొండను ఆనుకుని అటు బీచ్‌రోడ్డు, ఇటు హనుమంతవాక కూడలిని కలుపుతూ వాకింగ్ ట్రాక్ నిర్మించడంతో స్వచ్ఛమైన గాలితోపాటు సహజసిద్ధ పచ్చదనంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తోంది. దీంతో ఎరీనా సేవలు వినియోగించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతోపాటు మట్టి రోడ్డుతో కూడిన వాకింగ్ ట్రాక్ అందుబాటులో ఉండడంతో ఉదయం పూట వాకింగ్, జాగింగ్ చేసేందుకు అన్ని వర్గాల వారు ఆసక్తి కనబరుస్తున్నారు. బుద్ధవనం చుట్టూ ఉన్న ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం పూట పిల్లలు, వృద్ధులు పెద్ద ఎత్తున సేద తీరుతున్నారు. పార్కులో ఉన్న వ్యాయామ ప్రాంగణాన్ని సైతం సందర్శకులు పెద్ద ఎత్తున వినియోగించుకుంటున్నారు. శరీరాకృతిని పెంపొందించుకునేందుకు మహిళలు, పురుషులు వ్యాయామం చేస్తున్నారు. ఎరీనా పొడవునా సుందరీకరణ, ఆకర్షణీయమైన మొక్కల పెంపకం కోసం పదుల సంఖ్యలో వీఎంఆర్‌డీఏ సిబ్బంది సేవలందిస్తున్నారు. సందర్శకుల ఆకాంక్షకు అనుగుణంగా పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు అందించడంతోపాటు పచ్చదనాన్ని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

2014 నుంచి నిర్విరామ సేవలు

పార్కుల్లో ఉదయం నడక మార్గాల అభివృద్ధిలో భాగంగా హెల్త్ ఎరీనాను అందుబాటులోకి తేవాలని వీఎంఆర్‌డీఏ గతంలో భావించింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సహజ సిద్ధంగా తీర్చిదిద్దేందుకు 2009లో ఇక్కడ పనులు ప్రారంభించారు. కైలాసగిరి కొండ చుట్టూ కొంత భాగాన్ని చదును చేసి నడక మార్గాన్ని అభివృద్ధి చేశారు. 2.5 కిలోమీటర్ల పొడవున ఈ నడక మార్గాన్ని అభివృద్ధి చేశారు. దాదాపు 7 కోట్ల వ్యయంతో నడక, సైక్లింగ్ మార్గాలను ఇంజినీరింగ్ విభాగం అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు నగరంలోనే అతిపెద్ద బుద్ధ విగ్రహంతో కూడిన బుద్ధవనాన్ని ఇక్కడ ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ నిర్మాణ పనులు 2009లో ప్రారంభమైనప్పటికీ 2014లో హెల్త్ ఎరీనా సేవలు సందర్శకులకు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి సందర్శకులకు విశిష్ట సేవలు అందిస్తోంది.

ఇరుకు రహదారిలోనే కుళాయి పైపులు



బీఎస్‌ఆర్ నగర్ కొండపై నివసిస్తున్న వారు సొంతంగా అమర్చుకున్న కుళాయి పైపులు

ఆరిలోవ : తోటగరువు దరి బి.ఎస్.ఆర్.నగర్‌లో కుళాయి పైపులు రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇక్కడి ప్రజలు ఏళ్ల తరబడి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సుమారు 700 నివాసాలున్నాయి. ప్రధానంగా తాగునీటి సమస్య స్థానికులను ఏళ్ల తరబడి వేధిస్తోంది. కొండ దిగువన జీవీఎంసీ కుళాయిలు ఏర్పాటు చేసింది. కొండ దిగువన రోడ్డును ఆనుకొని రెండు, మూడు వరుసల వారికి మాత్రమే ఆ నీరు అందుబాటులో ఉంటుంది. కొండపైన ఉన్న మిగిలిన కుటుంబాలకు కుళాయి నీరు అందడం లేదు. దానికోసం కొండపైన నివాసాల వారు కుళాయి పాయింట్ల నుంచి కొందరు సొంతంగా పైపులు ఏర్పాటు చేసుకున్నారు. కొండ దిగువన ఉన్న జీవీఎంసీ కుళాయి మెయిన్ పాయింట్‌కు పైపులు అమర్చుకున్నారు. ఆ పైపులు కొండపై ఉన్న వారి నివాసాలకు రహదార్ల పైనుంచే అమర్చుకోవాల్సి వచ్చింది. కొండవాలు కావడంతోపాటు ఇరుకు రోడ్లు కావడంతో ఆ పైపులు రహదార్లపైనే ఉన్నాయి. కొండపైకి వెళ్లాల్సిన వారు ఆ పైపులు పైనుంచే నడవాల్సి వస్తోంది. దీంతో వాటిపై నడుస్తున్నప్పుడు అదుపు తప్పి జారిపడిపోతున్నామని స్థానికులు అంటున్నారు. దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్షేత్ర స్థాయిలో ఉద్యమంలా సంతకాలు సేకరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వార్డుల్లో క్షేత్ర స్థాయిలో కోటి సంతకాలు సేకరించాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 16వ వార్డు పార్టీ కార్యకర్తలతో సీతమ్మధారలోని కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు మద్దతుగా ఉద్యమంలా సంతకాలు సేకరించాలన్నారు. పేదలకు వైద్య విద్య అందించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం జగన్ మెడికల్ కళాశాలలు తీసుకొస్తే వాటిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించాలనుకుంటోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి వారి మద్దతు కోరాలన్నారు. 16వ వార్డులో అత్యధికంగా సంతకాలు సేకరించి, అన్ని వార్డులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, బూత్ కమిటీల కన్వీనర్ పల్లా శ్రీనివాస్, వార్డు ఉపాధ్యక్షుడు గొలగాని కన్నారావు, యువజన విభాగం అధ్యక్షుడు కొంగరాని రాంబాబు, జిల్లా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి వేములవలస అప్పారావు, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి మెట్ట సూర్యనారాయణ, వార్డు బీసీ విభాగం అధ్యక్షుడు బుగత మధు, వార్డు ప్రధాన కార్యదర్శి డొక్కర అప్పలరాజు, నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్ సందర్శించిన విద్యార్థులు



బయో డైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులు

బీచ్‌రోడ్డు : ఆంధ్ర యూనివర్సిటీ పర్యావరణ విభాగం విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను గురువారం సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం తెలియజేశారు.

వెలుగులను కమ్మేసిన నిర్లక్ష్యం



విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వెలుగులను కమ్మేసింది. జీవీఎంసీ 20వ వార్డు పరిధి కాగితాల వారి వీధిలోని నాగమయ్య పొట్ట శివాలయం సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఆకులతో కూడిన తీగలు అల్లుకున్నాయి. అవి ఎంతలా విస్తరించాయంటే... ఆ స్తంభాలపై ఉన్న లైట్ల నుంచి వచ్చే వెలుగును సైతం కప్పేసేలా అల్లుకున్నాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో చీకటి అలుముకుంది. అయినప్పటికీ ఆ శాఖ సిబ్బంది స్పందించి స్తంభాలపైకి పాకిన తీగలను తొలగించడం లేదు. కార్తీకమాసం సమీపిస్తున్నందున ఇప్పటికైనా సిబ్బంది స్పందించి తీగలు తొలగించి, వెలుగులు ప్రసరించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ ముయ్వల లక్ష్మీసురేష్ కోరుతున్నారు. స్థానికులు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో... ఆమె అధికారులతో మాట్లాడి విద్యుత్ దీపాల సమస్య పరిష్కరించాలని కోరారు.

– బీచ్‌రోడ్డు

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఆరిలోవలో విద్యార్థి ఇంటి వద్ద పుస్తకాలు పరిశీలించి సూచనలు చేస్తున్న ఉపాధ్యాయురాలు

ఆరిలోవ: పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో జిల్లాలో 100శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం రాత్రి ఆరిలోవ ప్రాంతంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. విద్యార్థుల నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు పరిశీలించి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో, ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి మంచి ఆహారం అందించాలని, చదువుకునే సమయంలో ఇతర పనుల ఒత్తిడి పెంచకూడదని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బీచ్‌రోడ్డు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని వారి తల్లిదండ్రులకు గురువారం అవగాహన కల్పించారు. చినవాల్తేరు కేడీపీఎం హైస్కూల్ పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఒక వినూత్న కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. రానున్న నాలుగైదు నెలలపాటు విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకుని చదివించాలని సూచించారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రక్షణ గోడలు లేక ప్రమాదాలు



శిథిలమై అధ్వానంగా మారిన సీసీ రోడ్డు



పాత డెయిరీఫారం పోస్టాఫీస్ రోడ్డులో రక్షణ గోడ లేని లోతైన కాలువ

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధిలో పలుచోట్ల గెడ్డలు, కాలువలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. వీటివల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తతో ఉన్నా వాటిలో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పాత డెయిరీ ఫారం దరి పోస్టాఫీస్ రోడ్డుకు ఒక వైపు లోతైన పెద్ద కాలువ ఉంది. ఆ కాలువను ఆనుకుని సీసీ రోడ్డు నిర్మించారు. ఇక్కడ రక్షణ గోడ లేకపోవడంతో వాహనచోదకులు అదుపు తప్పి కాలువలోకి పడిపోతున్నారు. దీంతోపాటు ఈ రోడ్డు శిథిలం కావడంతో కొన్నాళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. శిథిలమైన భాగంలో కొంత ఎత్తులో కాంక్రీట్ వేశారు. ఇది పాత రోడ్డుకు కొంత ఎత్తులో ఉండడంతో పాదచారులు కాళ్లకు తగిలి పడిపోతున్నారు. ఇక్కడ రక్షణ గోడ నిర్మాణంతోపాటు రోడ్డును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీఫారం పెట్రోల్ బంక్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన గెడ్డది కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ రోడ్డు పక్కన రక్షణ గోడ లేకపోవడంతో వాహనచోదకులు రాత్రివేళల్లో తరచూ గెడ్డలోకి దూసుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు

డాబాగార్డెన్స్: రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేసి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత పనులను కమిషనర్ పరిశీలించారు. మద్దిలపాలెం జంక్షన్ నుంచి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా పరిశుభ్రత పనులను పరిశీలిస్తూ, స్పెన్సర్స్ జంక్షన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు కమిషనర్ గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెదవాల్తేర్ గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేయాలని, వాడి పారేసిన కప్పులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు.

బీచ్ రోడ్డులో సీపీఆర్‌పై అవగాహన ర్యాలీ



ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, వైద్యులు

మహారాణిపేట: ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవం, సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా కాళీమాత ఆలయం సమీపంలోని బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనస్థీషియా సొసైటీ, ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రస్థాయి రోగులకు చికిత్స అందించడంలో అనస్థీషియాలజిస్టులు, అత్యవసర వైద్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సీపీఆర్ శిక్షణను సంవత్సరంలో ప్రతిరోజూ నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, విశాఖ అనస్థీషియా సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె. అపరంజి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కేజీహెచ్‌లో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలక్ష్మి సహా పలువురు ప్రముఖ అనస్థీషియాలజిస్టులు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్లు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని క్రీడల కోసం కేటాయించాలి



ఆరిలోవ కాలనీ - హెల్త్‌సిటీ మధ్యలో జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలం

ఆరిలోవ : ఆరిలోవ కాలనీ, హెల్త్ సిటీ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడల కోసం కేటాయించాలని స్థానిక యువత కోరుతున్నారు. సాధారణంగా లేఅవుట్‌లకు సామాజిక అవసరాల కోసం లేఅవుట్ వేకెంట్ ల్యాండ్‌గా కొంత స్థలాన్ని కేటాయిస్తారు. ఇందులో భాగంగా ఇక్కడ హెల్త్‌సిటీ, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌లు వేసే సమయంలో స్థలాన్ని వేకెంట్ ల్యాండ్‌గా జీవీఎంసీ కేటాయించింది. సుమారు రెండు ఎకరాలకు పైగా ఉన్న ఈ స్థలానికి ఇంతవరకు రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశారు. ఈ స్థలంలో ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల నుంచి యువకులు నిత్యం క్రికెట్ తదితర ఆటలు ఆడుకుని సందడి చేస్తున్నారు. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే పలుసార్లు ప్రకటించారు. దీనిపై యువకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని క్రీడల కోసం ఖాళీగా విడిచిపెట్టి, రక్షణ కల్పించాలని కోరుతున్నారు. దీనిపై యువకులంతా జీవీఎంసీ గత కమిషనర్లను పలుసార్లు కలిసి వినతిపత్రాలు కూడా అందించారు. నగరంలో ఇలాంటి స్థలాలు క్రీడల కోసం కేటాయిస్తే యువతను ప్రోత్సహించనట్లు అవుతుందని పలువురు భావిస్తున్నారు.